www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 11 | ఏప్రిల్ | 2025
పేజీలు 7

## ఏసిబికి చిక్కిన పోలీసులు

**- ముగ్గురిపై కేసు నమోదు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** లారీ ఓనర్ దగ్గరు రూ.20 వేలు లంచం తీసుకుని మోసపూరితంగా వ్యవహిరించిన భద్రాచలం సిఐ బర్పటి రమేష్, గన్‌మెన్ రామారావు, మరో వ్యక్తిపై ఏసిబి అధికారులు కేసు నమోదు చేసారు. వివరాల ప్రకారం లక్ష్మీపురం గ్రామం నుంటి మట్టిని తోలుతున్న లారీని మార్చి 19వ తేదిన పోలీసులు ఆపి అనుమతులు లేకుండా తోలుతున్నారంటూ భయభ్రాంతులకు గురిచేసి లారీని స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో మట్టితోలుకుంటున్న వ్యక్తి స్టేషన్‌కు వచ్చి ఇంటి అవసరాల నిమిత్తం తోలుతున్నట్లు చెప్పినప్పటికీ వినకుండా లారీ ఓనర్ కూడా రావాలంటూ పట్టుపట్టారు. ఈ క్రమంలో లారీ ఓనర్ సైతం వచ్చి వివరణ ఇచ్చినప్పటికీ శాంతించ లేదు. ఈ క్రమంలో లారీ ఓనర్ సైతం కేసు పెట్టుకోమని చెప్పడంతో సిఐ గన్‌మెన్‌గా వ్యవహరిస్తున్న రామారావు మధ్యలో కలుగజేసుకుని సిఐతో నేను మాట్లాడి సెట్ చేస్తాను రూ.30 వేలు ఇవ్వాలంటూ చెప్పాడు. దీంతో తాను ఇచ్చుకోలేనని, కేసు పెట్టుకోండి అంటూ లారీ ఓనర్ చెప్పినప్పటికీ మరో సారి రామారావు అడ్డుతగిలిన 20 వేలు ఇవ్వండి నేను సిఐతో చెప్పి సెట్ చేస్తానని అన్నాడు. డబ్బులు ఇప్పుడు లేవని చెప్పినప్పటికీ వెంటనే డబ్బులు ఇవ్వకుంటే కుదరదని అనడంతో విధి లేని పరిస్థితుల్లో రూ.20 వేలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. దీంతో రామారావు తన ఫోన్ నెంబర్‌కు కాకుండా

మిగతా 2లో..

# పాల కూట విషం..!



- విచ్చల విడిగా పాలకల్తీ..?
- విషపూరిత పాలతో రోగాల పాలు
- ఉత్పత్తికి, వినియోగానికి బోలెడంత తేడా
- పాలకల్తీపై కరువైన నిఘా
- కానరాని ఫుడ్‌సెఫ్టీ అధికారుల తనిఖీలు





కనిపించే తెల్లనివన్నీ పాలూ కాదూ.. నల్లనివన్నీ నీళ్ల కాదన్నట్లు ప్రస్తుత పరిస్థితులు దాపురించాయి. జిల్లా వ్యాప్తంగా కల్తీపాల వ్యాపారం రాజ్యమేలుతోంది. విషపూర్తి పాలను తయారు చేస్తూ వేలాది లీటర్ల విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే పాలకు, నిత్యం వినియోగించే పాల లెక్కలు బోలెడంత వ్యాత్యాసం ఉంది. కల్తీ పాలను పోస్తూ పిల్లలు, పెద్దల పాల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ వ్యవహారంపై నిఘా పెట్టాల్సిన అధికారులు ఏ ఒక్కరోజు కూడా తనిఖీలు చేసినట్లు కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న విషపూరిత పాల వ్యాపారంపై 'పజాపక్షం' ప్రత్యేక కథనం

-ప్రజాపక్షం/భద్రాచలం

2లో

## చిరస్మరణీయుడు మహ్మాద్ రజబ్ అలీ



- లంబాడోళ్ల రాందాస్‌గా గుర్తింపు
- వర్ధంతి సభలో బాగం
- రజబ్ అలీకి ఘన నివాళి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సుదీర్ఘ కాలం శాసన సభ్యునిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన మహ్మాద్ రజాబ్ అలీ చిరస్మరణీయుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా రజబ్ అలీ ప్రజల మదిలో నిలిచిపోయారన్నారు. మహ్మాద్ రజబ్ అలీ 29వ వర్ధంతిని సిపిఐ ఆధ్వర్యంలో వారి స్వగ్రామం రఘునాథపాలెం మండలం పాపటపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గురువారం

మిగతా 2లో..

## సేంద్రియ ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం



- మామిడి పండ్ల విక్రయానికి తాత్కాలిక మార్కెట్
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సేంద్రీయ పద్దతుల్లో సాగు చేసిన పంట ఉత్పత్తుల వినియోగం వల్ల మనకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం స్థానిక గ్రాండ్ గాయత్రి హోటల్‌లో జరిగిన మామిడి పండ్ల కొనుగోలు, అమ్మకందారుల సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలో కూడా లాభదాయక వ్యవసాయం నడవడం లేదని అమెరికా, ఇంగ్లాండ్, రష్యా, యూరప్ లాంటి దేశాలలో కూడా ప్రభుత్వ సబ్సిడీ 90 శాతం వరకు ఉంటేనే వ్యవసాయం చేయగలుగుతున్నారని, నేటికి వారి ఆహారం కూడా చాలా వరకు మన దేశం నుంచి వెళ్తుందని తెలిపారు.

మిగతా 2లో..

# ధన్యజీవి మహ్మద్ రజబ్అలీ

-ఘనంగా 29వ వర్ధంతి






**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహ్మద్ రజబ్అలీ ధన్యజీవి అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. మాజీ శాసన సభ్యులు, సిపిఐ నాయకులు మహ్మద్ రజబ్అలీ 29వ వర్ధంతి సందర్భంగా గురువారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రజబ్అలీ అలుపెరుగని పోరాటాలు సాగించారన్నారు. ఆరుసార్లు ఎంఎల్ఏగా గెలుపొంది ప్రజల పక్షాన గొంతుకగా నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పలు ప్రజా ఉద్యమాలకు రజబ్అలీ నాయకత్వం వహించారన్నారు. చారిత్రిక భూ పోరాటాలకు నాయకత్వం వహించి వందలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశారన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి రజబ్అలీ చేసిన కృషి మరువలేనిదన్నారు. గిరిజనుల పక్షపాతిగా నిలిచిన ఆయనను లంబాడోళ్ల రాందాస్‌గా పిలుచుకుంటారన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మూడున్నర సంవత్సరాలు జైలు జీవితాన్ని రజబ్అలీ గడిపారన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామ కృష్ణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి, గాదె లక్ష్మినారాయణ, యానాలి సాంబశివారెడ్డి, సైదా, ఎస్‌కె చానా, బోడా వీరన్న, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయండి

**జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల**



**ప్రజాపక్షం/చింతకాని :** గులాబీ పార్టీ 25 ఏళ్ల పండుగకు చింతకాని మండలం నుంచి దండులా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. గురువారం మండలపరిధిలోని మాజీ వైస్‌ఎంపీపీ గురిజాల హనుమంతరావు నివాసంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరావుతో కలిసి లింగాల మాట్లాడుతూ సభను విజయవంతం చేసే భాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కేసిఆర్ సీఎంగా లేకపోతే రాష్ట్రం ఎలా ఆగమవుతున్నదన్నది ప్రజలకు అర్థమవుతున్నదన్నారు.విజన్ ఉన్న నాయకుడు కేసిఆర్ అని ,ఎడారిగా ఉన్న తెలంగాణను సస్యశ్యామలంగా మార్చాడన్నారు. సాగు, తాగు నీరు, ఉచితంగా 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు భీమా తదితర అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. రేవంత్‌రెడ్డి మెసపూరిత మాటలు నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కటంటబెట్టారని, ఇప్పుడు కేసిఆర్‌ను ఎప్పుడు ముఖ్యమంత్రిని చేద్దామా అని ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ 100 సీట్లు సాధిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు టికెట్లు కేటాయిస్తామన్నారు.ఈ నేపథ్యంలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ .. తెలంగాణ ప్రజలకు వెలుగు దివ్వె కావాలని ఆకాంక్షించారు.బీఆర్ఎస్ ద్వారానే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బారాస మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, మాజీవైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, నాయకులు మంకెన రమేష్, కురుగుంట్ల రవీందర్ రెడ్డి, వేముల నర్సయ్య, పిన్నెల్లి శ్రీనివాస్ , కొండలరావుతదితరులు పాల్గొన్నారు.

# రజబ్ అలీ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలి

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు**




**ప్రజాపక్షం/కొణిజర్ల :** రజబ్ అలీ స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు పేర్కొన్నారు. స్థానిక కొణిజర్ల సిపిఐ కార్యాలయంలో గురువారం రజబ్ అలీ 29వ వర్థంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తెలంగాణ సాయుధ పోరాట యోధులు నిస్వార్థంగా సుధీర్గకాలంగా శాసనసభ్యులుగా చేసిన మహానేత అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని నాడు నిజాంకు వ్యతిరేకంగా భూమికోసం , భుక్తికోసం జరిగి తెలంగాణా రైతాంగ సాయుధపోరాటంలో ఎన్నో అక్రమ కేసులు ఆయనపై బనాయించారని అన్నారు. మొక్కవోని పట్టుదలతో గిరిజనుల పోడు భూముల పోరాటంలో ప్రత్యక్షంగా నాయకత్వం వహించారని తెలిపారు. ఈకార్యక్రమంలో కొణిజర్ల మాజీ ఉపసర్పంచ్ గొడ్డుగొర్ల శ్రీను, రైతుసంఘం నాయకులు తండు సోమయ్య, కొమ్మిన్ని వెంకయ్య, చింతల ఆదిరెడ్డి, దొడ్డపునేని వెంకటేశ్వర్లు, కొల్లి లక్ష్మయ్య, షేక్ సైదులు, ఎండి షారా తదితరులు పాల్గొన్నారు.

# మానవతావాది రజబ్ అలీ : దొండపాటి




**ప్రజాపక్షం/కొణిజర్ల :** సుజాతనగర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సిపిఐ సీనియర్ నాయకులు అమరజీవి మహమ్మద్ రజబ్ అలీ మానవతావాది అని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. గురువారం స్థానిక దొండపాటి భవన్‌లో అమరజీవి రజబ్ అలీ 29వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు భూ మికోసం, భుక్తికోసం పేద ప్రజల విముక్తి కోసం నిరంతరం పోరాడిన వీరుడు రజబ్ అలీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి తండు సోమయ్య, ఆర్గనైజర్, కార్యదర్శి తోటపల్లి సీతారాములు, అడపా వెంకటేశ్వర్లు, కొమ్మిన్ని వెంకయ్య, బండారు వెంకన్న, అడపా కృష్ణయ్య, తుప్పతి వెంకటేశ్వర్లు, తుప్పతి రామారావు, చింతల ఆదిరెడ్డి, అమ్మటి నాగులు తదితరులు పాల్గొన్నరు.

# కవి గౌతమ్ లింగాకి వంశీ అంతర్జాతీయ ఉగాది పురస్కారం



**ప్రజాపక్షం/కామేపల్లి:** ఖమ్మం పట్టణానికి చెందిన ప్రవాస కవి గౌతమ్ లింగాకి ప్రతిష్టాత్మక వంశీ అంతర్జాతీయ ఉగాది పురస్కారం అందజేయనున్నట్లు వంశీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ వంశీ రామరాజు గురువారం తెలిపారు. వివిధ రంగాల్లో అత్యున్నత స్థాయిలో ప్రతిభని కనబరిచిన పలువురికి ఈ అవార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం త్యాగరాయ గాన సభ హైదరాబాద్‌లో ఈ పురస్కార ప్రధానం ఉంటుందన్నారు. గౌతమ్ లింగా అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు ఖమ్మం కవులు హర్షం వ్యక్తం చేశారు. గౌతమ్ లింగా ఐసిడిఎస్ కామేపల్లి సర్కిల్ సూపర్వైజర్ పారుపల్లి లక్ష్మి కుమారుడు. అవార్డుకి గౌతమ్ లింగా ఎంపిక కావడం పట్ల ఐసిడిఎస్ అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, మండల వాసులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# వైభవంగా కామేపల్లి శివాలయం జీర్ణోద్ధరణ



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లిలో పురాతనమైన శ్రీ బాలత్రిపుర సుందరి సహిత ఇష్టకామేశ్వరి స్వామి దేవాలయం(శివాలయం)గురువారం జీర్ణోద్ధరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 3గంటలకు శివాలయంలో గణేష్ పూజ హోమం అంతకురార్పణ తదితర కార్యక్రమాలలో వేద పండితులు బలగం భార్గవ శర్మ నేతృత్వంలోని సుమారు 11 మంది పురోహితులు వేద మంత్రోచ్చారణలు మరో వైపు భక్తులు శివనామ స్మరణ చేస్తుండగా కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం దేవతమూర్తులను ఆలయం ఎదురుగా ఉన్న గురు మందిరంలోనికి మంగళ వాయిద్యలతో తరలించారు. సుమారు 6గంటల పాటు జరిగిన కార్యక్రమానికి కామేపల్లితో పాటు పరిసర గ్రామ ప్రజలు వందలాది మంది పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గొట్టిపర్తి శివాజీ, మహంకాళి రామ నరసయ్య, దమ్మలపాటి శివాజీ, బండి శ్రీనివాస్, శేషారావు, నాగయ్య, కేశగాని వెంకటేశ్వర్లు, నెహ్రూ, ఫణి శర్మ, సాయికుమార్, రఘుకుమార్, మోసం కృష్ణమూర్తి, తేరాల వెంకటేశ్వర్లు, నారాయణరావు, అజ్మీర హరి, రామ్‌దాస్, హనుమంతరావు, సైదులు, బ్రహ్మం, శ్రీనివాసచారి, నాగేష్, మనోజ్‌కుమార్, స్వర్ణకుమార్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే కోరం



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు ఆర్టీసీ బస్టాండ్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికులతో ముచ్చడించి, ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడారు. ప్రతీ రోజూ ప్రయాణికులు వెళ్లే సంఖ్య, బస్టాండ్ లోని కార్గో , పార్సిల్ , శానిటేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, బస్టాండ్ ప్రాంగణంలో దుఖాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మండల రాము, మడుగు సాంబమూర్తి, మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్, డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాజీవ్ యువ వికాసం పథకం క్రింద వచ్చే దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. అక్కడికి వచ్చిన దరఖాస్తుదారులతో కమిషనర్ మాట్లాడారు. ఏఏ యూనిట్లను ఎంచుకున్నారు, ఆ పనిలో ఎంత మేరకు అనుభవం ఉంది, కుటుంబ సభ్యుల తోడ్పాటు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారి దగ్గర నుంచి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలతో కలిపి దరఖాస్తు చేసుకుంటున్నారా లేదా అనేది పరిశీలించాలన్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా లేదా అనేది పరిశీలించి తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని అప్లికేషన్లు వచ్చాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## రజబ్ అలీకి ఘన నివాళి



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండల కేంద్రం లోని సిపిఐ పార్టీ ఆఫీస్ నందు నిస్వార్థ, నిబద్ధత కలిగిన కమ్యూనిస్ట్ నాయకుడు, బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం ప్రజాక్షేత్రం లో ప్రజల కొరకు పోరాడిన మహా నేత సుజాతనగర్ మాజీ ఎమ్మెల్యే రజబ్ అలీ 29వ వర్ధంతి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, సుజాతనగర్ మండల సంయుక్త కార్యదర్శి కొమరి హనుమంతరావు, మాజీ ఎంపీటీసీ మూడ్ గణేష్, విద్య కమిటీ చైర్మన్ కొమరి కృష్ణ, మండే నాగేశ్వరావు, కత్తి వెంకన్న, జోనబోయిన కొమరయ్య, ఆకుల వెంకన్న, దొడ్డ వెంకన్న, భూక్య రవి, భూష్కని నరేష్, కత్తి రాములు, గుర్రం సత్యం, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి భూక్య రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** అధికారం చేపట్టిన నుంచి ధరలు అమాంతం పెంచుకుంటూ పోతున్న కేంద్ర ప్రభుత్వానికి దేశ ప్రజలు బుద్ధి చెప్పాలని, పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ తను ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజు నుండి పేదోడి కష్టార్జితాన్ని తన మిత్రులైన ఆదానీ అంబానీ లాంటి అనేక కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టటమే తన ధ్యేయంగా పెట్టుకొని పరిపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటివరకు గ్యాస్ ధరలు 225% పెంచి మహిళలను మళ్లీ కట్టెల పొయ్యి వైపు వెళ్లే విధంగా చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. సామాన్య ప్రజానీకాని నడ్డి విరిచే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఒకటేసారి 50 రూపాయలు పెంచి సామాన్య పేద మధ్య తరగతి కుటుంబాలకు ఇబ్బందులు చేకూరే విధంగా కేంద్ర ప్రభుత్వం చేస్తుందని తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కె. నాగుల్ మీరా, సిపిఐ నాయకులు యాలంకి మధు, వల మల్ల సామేలు, ఎస్కె. చాంద్ పాషా, నిమ్మటూరి లచ్చయ్య, పత్తిపాటి మహేష్, షేక్ బుడెన్ పాషా, శివ, గార్లపాటి రమణయ్య, చీమకుర్తి సంతోష్, నరేష్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పవర్ లిఫ్టింగ్‌కు ఎన్నికైన మణుగూరు యువకుడు




**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 19, 20వ తేదీలలో హైదరాబాద్ లో జరగబోయే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు గాను ఈ నెల 9న జరిగిన జిల్లా స్థాయీ పోటీల ఎంపిక లో మణుగురు తరుపున స్కై జిమ్ కోచ్ పోడిశెట్టి నాగరాజు ఆరుగురు యువకులను సిద్ధం చేశారు. వారిలో 53, కేటగిరి లో లక్ష్మణ్, ఖైరుద్దీన్ అనే యువకులు మొదటి స్థానం లో గెలిచి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ కి ఎంపిక అయ్యారు. 72 కేటగిరి లో ఖమర్ అనే యువకుడు రెండవ స్థానం లో గెలిచి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ కి ఎంపిక అయ్యారు. 77 కేటగిరిలో హఫీజ్ అనే యువకుడు మొదటి స్థానం లో గెలిచి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ కి ఎంపిక అయ్యారు. 93 కేటగిరి లో మాథిన్ అనే యువకుడు రెండవ స్థానం లో గెలిచి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ కి ఎంపిక అయ్యారు. ట్రైనర్ నాగరాజు కూడ 66 కేటగిరిలలో పాల్గోని మొదటి స్థానం లో నిలిచి రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ కి ఎంపిక అయ్యారు. స్కై జిమ్ ట్రైనర్ నాగరాజు యువకులను పవర్‌లిఫ్టింగ్‌లో ఉన్నత స్థాయికి ఎదగడానికి తోడ్పడుతున్నారు.

## అడవులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** పోడు భూముల పేరుతో అడవులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ జిల్లా అధికారి కృష్ణ గౌడ్ అన్నారు. గురువారం చంద్రుగొండ రేంజ్ పరిధిలో అడవులను ప్లాంటేషన్లను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక రేంజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అడవి జంతులను వేటాడితే వారిపై కఠినంగా చర్యలు తీసురంటామన్నారు. పర్యాటక కేంద్రంపై అటవీ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందుతే ఉపాధి అవకాశాలతో పాటు ఆదాయ వనరులు సమకూర్తాయన్నారు. పర్మినెంట్ అటవీ భూమికి ట్రెంచులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోడు నరికే వారికి అటవీ సిబ్బంది అవకాశన కల్పించాలన్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోడు పట్టాలు ఎక్కువగాగ ఇచ్చామని గుర్తు చేశారు. భవిష్యత్ తరాల కోసం అడవుల్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఆయన వెంట అటవీ డివిజనల్ అధికారి కోటేశ్వరరావు, రేంజర్ ఎల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టా రాదు.. పథకాలు అందవు




**ప్రజాపక్షం/చింతకాని :** రైతుకు భూమి యాజమాన్యాన్ని ధ్రువీకరించే చట్టపరమైన గుర్తింపు పత్రమే పట్టాదార్ పాస్ పుస్తకం. రైతు ఎంత భూమి కలిగి ఉన్నాడో అధికారికంగా రుజువుచేస్తుంది. రైతులు రుణాలు పొందటానికి , ప్రభుత్వం అమలు చేసే వ్యవసాయ పథకాలు పొందేందుకు పట్టా పుస్తకమే కీలకం.ఆరు నెలల నుంచి పట్టా పాసుపుస్తకాల జారీ నిలిచి పోవడంతో నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు. గతంలో రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యాక నెల రోజుల్లో పాసుపుస్తకం పోస్టాపీస్ ద్వారా భూయజమానుల ఇంటికే చేరేది.జిల్లాలో వేలాది మంది రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు రాక బ్యాంకుల్లో పంట రుణాలతో పాటు ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో నిత్యం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రోజుకు సగటున ఒక్కో మండలంలో 3 నుంచి 15 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత డిసెంబరు నుంచి మార్చి చివరి వరకు సుమారు 5470 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

**పంపిణీ తపాలా ద్వారా...**

తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యాక సీసీఎల్ఏ కార్యాలయానికి ఆన్‌లైన్ లో అప్‌లోడ్ అవుతాయి. అనంతరం రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పాసుపుస్తకాలను ప్రభుత్వ అనుమతులు పొందిన ప్రింటింగ్ ప్రెస్‌లలో ముద్రించి తపాలా ద్వారా నేరుగా రైతుల ఇంటికే పంపిణీ చేస్తారు.

**బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదు : నెల్లూరి నరసింహారావు( రైతు బాణాపురం గ్రామం, ముదిగొండ మండలం)**

చింతకాని తహసీల్దార్ కార్యాలయంలో డిసెంబర్ 18వ తేదీన 1.36 ఎకరాల భూమిని నా పేరున కొనుగోలు రిజిస్ట్రేషన్ అయ్యింది. నాలుగు నెలలు దాటినా పాసు పుస్తకం అందలేదు. తహసీల్దార్ కార్యాలంలో సంప్రదిస్తే నేరుగా రైతుల ఇంటి వద్దకే పోస్ట్‌లో వస్తాయని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం అధికారులు ఇచ్చిన స్పెసిమెన్ కాపీ చూపించినా బ్యాంకు వారు పుస్తకం లేనిదే పంట రుణాలు ఇవ్వడంలేదు.

**అధికారుల దృష్టికి తీసుకెళ్తా : కూరపాటి అనంతరాజు, తహసీల్దార్ చింతకాని**

సాధారణంగా భూముల పట్టాదారు పాసు పుస్తకాలు తపాలాద్వారా రైతుల ఇంటికే నేరుగా వస్తాయి. పాసుపుస్తకాలు రావడం లేదని పలువురు రైతులు నా దృష్టికి తీసుకొచ్చారు. పాసు పుస్తకాల ఆలస్యం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాము.

## సింగరేణి పాఠశాలలో టిఎస్ పాలీసెట్ ఉచిత శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశాల మేరకు, సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు నెలరోజులపాటు సింగరేణి ఉన్నత పాఠశాల పీ.వి కాలనీ మణుగూరు నందు, ఎంతో అనుభవం కలిగిన సింగరేణి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల చేత టీ.ఎస్. పాలీసెట్ 2025 ఉచిత శిక్షణా తరగతులను నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా మణుగూరు ఏరియా ఎస్ ఓ టు జి ఎం శ్యామ్ సుందర్, విశిష్ట అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రమేష్ విచ్చేసి రిబ్బన్ కట్ చేసి శిక్షణ తరగతులను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఈ శిక్షణా తరగతులు ఉద్దేశించి ఎస్ ఓ టు జిఎం శ్యాంసుందర్ మాట్లాడుతూ 202425 సంవత్సరం లో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్య అనేది చాలా గొప్ప అవకాశం అని, పాలిటెక్నిక్ డిప్లమా చేసినవారు సింగరేణిలో నేడు ఎంతో ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని అటువంటి గొప్ప అవకాశాన్ని మీరందరూ కూడా సద్వినియోగం చేసుకొని మీరు కూడా ఆ స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ రమేష్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మన్ ఎన్. బలరాం ఆశయాల మేరకు సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎస్. పాలీసెట్ 2025 ఉచిత శిక్షణ తరగతులను సింగరేణి పాఠశాల విద్యార్థులు మరియు ఇతర పాఠశాలలో చదువుతున్న సింగరేణి ఉద్యోగుల విద్యార్థుల తో పాటు సమీప గ్రామాల నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కూడా సంఖ్యను బట్టి కోచింగ్ కు అవకాశం కల్పిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎక్కువ మంది విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం ఎం.వేణు, సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణ బాబు, శిక్షణ ఉపాధ్యాయులు లలిత మేడం, మమతా మేడం, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయమూర్తిని కలిసిన ఇల్లందు బార్ అసోసియేషన్ నూతన కమిటీ



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇటీవలే ఇల్లందు బార్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయమూర్తి వసంత్ పాటిల్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్ తోపాటు నూతన సభ్యులు మర్యాధపూర్వకంగా కలిసి శాలవాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ మేరకు జిల్లా న్యాయమూర్తి ఇల్లందులో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు అందజేశారు. ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న సిబ్బంది కొరతను తొందరలోనే భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.కె.ఎం.డి. ఖాసిం, సంయుక్త కార్యదర్శి చినుముల నవీన్‌కుమార్, కోశాధికారి మూడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం వెంకటాపురం, దుద్దెపూడి గ్రామాల్లో సోసైటి ఆధ్వర్యంలో లచ్చన్న గూడెం, భీమవరం, చౌడవరం గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు గురవారం ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సోమిరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ గొర్ల సంజివరెడ్డి, భరణి పాడు సొసైటీ చైర్మన్ కూరపాటి నాని, లచ్చన్నగూడెం మాజీ సర్పంచ్ గరికపాటి శ్రీనివాసరావు, పుచ్చకాయల సత్యనారాయణ, మార్కెటింగ్ డైరెక్టర్ పాముర్తి లక్ష్మి, చంటి, జగన్ మోహన్ రావు, యర్రా సత్యనారాయణ, సురేష్ , రమేష్ , బోళ్ళ నరసింహారావు, మల్లెల నరసింహారావు, ఎంపిడిఓ, ఏపిఎం, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకోవాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకుని దానికి అనుగుణంగా శాస్త్రవేత్తల సిఫారసు మేరకు ఎరువుల వాడుకోవాలని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో భూసార పరీక్షల కొరకు మట్టి నమూనాల సేకరణ అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ రైతులు పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలకు అధిక మోతాదులో రసాయనాలు, ఎరువులు వాడటం, సేంద్రీయ ఎరువులు వాడకపోవడం వల్ల భూమిలో పోషకాల సమతుల్యత లోపిస్తుందన్నారు. దీని వల్ల రైతులు ఆశించిన దిగుబడులు సాధించలేకపోతున్నారని పెట్టుబడులు కూడా ఎక్కువై ఆదాయం తగ్గుతుందన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించుకుని దానికి అనుగుణంగా సిఫారసు మేరకు ఎరువులు, మందులు వాడాలన్నారు. సేంద్రీయ ఎరువులు వాడటం వల్ల భూమిలో సూక్ష్మ పోషకాల లభ్యత పెరుగుతుందన్నారు. దాని వల్ల పంట దిగుబడులు కూడా పెరుగుతాయన్నారు. క్లస్టర్ పరిధిలో సమస్యాత్మక భూముల్లో భూసార పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులుఅధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవో బి. శిరణ్మయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

**- అభినందించిన ఎస్పి రోహిత్ రాజ్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** పోక్సో కేసులో నిందితునికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం తీర్పు వెలువరించారు. ఇల్లెందు మండలం తంగేళ్లగడ్డకు చెందిన భూక్యా నాగేశ్వర్రావు అలియాస్ నగేష్ తమ బంధువుల కుమార్తెలు అయిన ఆరు, నాలుగు సం.ల బాలికలైన అక్క చెల్లెళ్లను చాక్లెట్లు ఇస్తానని చెప్పి గత ఏడాది జూలై 4వ తేదిన తన ఇంట్లోకి తీసుకెళ్లి అగాయిత్యం చేశాడు. వారి అరుపులకు నాగేశ్వరరావు పారిపోయాడు. ఈ విషయంలో బాలికల తండ్రి అదే ఏడాది జూలై 5వ తేదిన ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సిఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేశారు. ఈ విషయంలో 15 మంది సాక్షులను విచారించగా నేరం రుజువుకావడంతో నాగేశ్వరరావుకు జీవితఖైదు తో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నింధితునికి శిక్ష పడేలా చేసిన కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, ఇల్లెందు డిఎస్పి చంద్రభాను, ఇల్లెందు సిఐ సత్యనారాయణ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మి , భరోసా సెంటర్ కొత్తగూడెం లీగల్ ఆఫీసర్ గద్దాడి శిరీష, కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్సై జి ప్రవీణ్ కుమార్, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎక్సే అబ్దుల్‌ఘని, డ్యూటీ ఆఫీసర్ తాళ్లూరి శ్రీనివాసరావులను రోహిత్ రాజ్ ప్రత్యేకంగా అభినందించారు.

# చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** వేసవిని దృష్టిలో ఉంచుకొని వైద్యశాలకు విచ్చేస్తున్న రోగులతో పాటుగా, మండల ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ప్రభుత్వ వైద్యులు డిడి డాక్టర్ సంఘమిత్ర, రేవంత్ అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండుటెండల్లోనూ, సుధూర ప్రాంతాల నుండి ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులు ప్రజానీకానికి చలివేంద్రం ఏర్పాటు చేయడమే వైద్యారోగ్య ప్రధాన కర్తవ్యమని తెలిపారు. మండలంలోని 12 గ్రామ పంచాయితీలో గల 44 గ్రామాలలో నుండి రోజువారీగా గర్భిణీ మహిళలు, వైద్య చికిత్సల కోసం, వడదెబ్బకు గురైన ప్రజలకు, అనివార్య కారణాలతో ప్రమాదాలకు గురైనా రోగులకు, ప్రజలకు కూలీలకు పాదాచారులకు సైతం సౌకర్యవంతంగా చలివేంద్రం ఏర్పాటుతో త్రాగునీరు మంచినీటి సదుపాయాన్ని కల్పించడం జరిగిందన్నారు. మండుటెండల్లోని వైద్యశాలకు, మండల వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు విచ్చేస్తున్న ప్రజానీకానికి, ప్రజా సేవే తమ ప్రధాన లక్ష్యంగా భావించి, చలివేంద్ర ఏర్పాటును చేయడం జరిగిందని గుర్తు చేశారు. వైద్య కేంద్రంలోని చలివేంద్రం మంచినీటి సౌకర్యాన్ని రోగులు, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సంఘమిత్ర విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రమాదేవి, సూపర్వైజర్ సులోచన, మొబైల్ సిబ్బంది నరేష్, ఎల్టి పార్వతి, స్టాఫ్ నర్స్, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వంటగ్యాస్ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దుర్మార్గం



**- పెంచిన ధరలు తగ్గించకుంటే ఆందోళనలు తప్పవు : కల్లూరి**

**ప్రజాపక్షం/చర్ల :** వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రప్రభుత్వం పెంచడం దుర్మార్గమని వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా చర్ల మండల కేంద్రంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కల్లూరి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ దేశంలో బిజెపి ప్రభుత్వం పేద,మధ్య తరగతి, సామాన్య ప్రజలపై భారం మోపడానికి వంట గ్యాస్, పెట్రోల్ , డీజిల్ ధరలు పెంచడం సరైంది కాదని, పేదలు, మహిళలపై గ్యాస్ భారం పెంచుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం చమురు ధరలు తగ్గించకుండా ఆయిల్ కంపెనీలకు వత్తాసు పలుకుతూ అర్ధరాత్రి గ్యా స్ సిలెండర్ పై రూ.50 పెంచారని, పెంట్రోల్ , డీజిల్‌పై రూ.2 పెంచి వీటి ని ఆయా కంపెనీలు భరించాలని మం త్రివర్గం పేర్కొనడం సరిగా లేదని, ఏదో ఒకరోజు వీటిని పెంచరనే గ్యా రెంటీ ఏముందని అన్నారు. నరేంద్రమోడి ప్రధానిగా 11 సం. గడిచిపోయిందని, ఈ కాలంలో పేద,మధ్యతరగతి ప్రజలపై అనేక భారాలు మోపారని, అనేక సార్లు గ్యాస్, పెట్రోల్ , డీజిల్ ధరలు పెంచారని, పేదల జీవన ప్రమాణాలు దెబ్బతీసే విధంగా మోడి పాలన ఉందని, పెట్టుబడి దారీ వర్గాలు, బహుళ జాతి కంపెనీలకు లాభాలు చేకూర్చే క్రమంలోనే ఇందతా సాగుతోందన్నారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించకుంటే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆదోళనలు, ఉధ్యమాలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, కణితి మంగమ్మ, కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీ నారాయణ, కోడిరెక్కల రాజారావు, కల్లూరి సీతారాములు, మునిగెల రామారావు, కట్టం నాగేశ్వరరావు, నాగరాజు, నర్సింహారావు, రమణ, మహేష్, తేజ, వెంకట్రావు, శ్రీను, వెంకటేష్, మోహన్ రావు, సత్యనారాయణ, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాలకు పెయిటింగ్స్, మరమ్మతులు చేయించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పెయిటింగ్స్, మరమ్మతులు చేయించాలని మాల మహానాడు మండల అధ్యక్షులు పిల్లి లాలయ్య అన్నారు. గురువారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమం సందర్భంగా బూర్గంపాడు మండలంలో ఉన్న 18 గ్రామ పంచాయితీలో ఉన్నటువంటి భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ఏమైనా మరమ్మతులు ఉంటే సరి చేయించడం, పెయింటింగ్స్ కూడా వేయించాలని బూర్గంపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జములారెడ్డిని కలిసి మెమొరాండం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న జరిగేటువంటి భారత రత్న, భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని ప్రతి పల్లెలో పండుగ వాతావరణంలా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పెరుమల్ల అజయ్, మహిళా నాయకురాలు పిల్లి ఆదిలక్ష్మి , లావణ్య, సంతోష్, సుధీర్, పిల్లి వెంకటేశ్వర్లు, అఖిల్, అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విస్తృతంగా పర్యటించిన మదన్ లాల్





**ప్రజాపక్షం/కారేపల్లి:** మండంలో పలు గ్రామాల్లో వైరా మాజీ ఎంఎల్ఏ బానోత్ మదన్ లాల్ గురువారం విస్తృతంగా పర్యటించారు. శాంతినగర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇరప సత్యం గుండెపోటు కారణంగా నిన్న మరణించగా, వారి కుటుంబాన్ని పరామర్శించి, వారికి నివాళులర్పించారు. అదే విధంగా సీతారాంపురం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పోలూరు రామారావు సోదరుడు పోలూరు నాగేశ్వరరావు మరణించగా, వారికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారి కుటుంబాలను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు హనుమకొండ రమేష్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బన్సీలాల్, ఎస్కే గౌస్ ఉద్దీన్, బానోత్ రాజేష్‌నాయక్, నాగరాజు, రామారావు, అప్పారావు, హరీష్, కోటేశ్వరరావు, హీరాలాల్, తదితరులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలు డీజిల్, పెట్రోల్ ధరలు 50రూపాయలు పెంచడాన్ని వెంటనే తగ్గించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీనేత భూక్య శివానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల మాదారం గ్రామంలో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం మరోసారి దేశ ప్రజలపై కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు నష్టం చేసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేనిపక్షంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బలమైన ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

## కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కేంద్రం పెంచిన గ్యాస్ బండ ధరలను తగ్గించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాశిబోయిన అయోధ్య డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలను నిరసిస్తూ గురువారం గ్యాస్ బండలతో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు అత్యవసరంగా మారిన గ్యాస్ ధర ను పెంచటం సిగ్గు చేటు అన్నారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు అందించి పేదల పై మాత్రం భారం మోపుతున్నారని మండిపడ్డారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లపు వీరభద్రం, వీరయ్య, పి.వెంకన్న, యల్లయ్య. కె.భద్రమ్మ, వి.ఆనూష తదితరులు పాల్గొన్నారు.

# తాటిపూడి ఇన్వెస్టర్ గౌడాన్ నిల్వలపై విచారణ ప్రారంభం

## బియ్యం దిగుమతులపై ప్రత్యేక దృష్టి : డిఎస్‌వో శ్రీలత


తాటిపూడి ఇన్వెస్టర్ గౌడాన్‌లో మిల్లర్లతో ఒప్పందం




**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి సమీపంలో ఉన్న ఇన్వెస్టర్ గౌడాన్‌లో బియ్యం దిగుమతులపై జిల్లా సవిల్‌సప్లై అధికారులు విచారణకు ఆదేశించారు. సివిల్‌సప్లై గౌడాన్‌లో ఏం జరుగుతుంది. ఆ ప్రైవేటు వ్యక్తి ప్రమేయం ఎంతవరకు ఉంది. ఆ ప్రైవేటు వ్యక్తి చేతుల్లో ఎవరెవరు పని చేస్తున్నారు. మిల్లర్లతో ఎలాంటి సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు అనే దానిపై విచారణ చేపట్టారు. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి లారీల ద్వారా తాటిపూడి ఇన్వెస్టర్ గౌడాన్‌లోకి దిగుమతి అవుతున్న బియ్యంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా సివిల్‌సప్లై అధికారులు గంట శ్రీలత తెలిపారు. ఎందుకంటే లారీలు ద్వారా దిగుమతి చేసుకున్న బియ్యం నాణ్యతతో కూడిన లేదా నాణ్యత లేనివా అనే దానిపై కూడా లోతుగా విచారణ చేస్తున్నారు.జిల్లా సివిల్‌సప్లై అధికారిని గంటా శ్రీలత జిల్లావ్యాప్తంగా ఉన్న సివిల్‌సప్లై గౌడాన్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎలాంటి బియ్యం దిగుమతుల్లో నాణ్యత పరిణామాలు లేకుండా దిగుమతి చేసుకున్న వారిపై చట్టపరంగా చర్యలకు వెనకాడేది లేదని గంటా శ్రీలత తెలిపారు.

# కొండకొడిమలో పోషణ పక్షంపై అవగాహన



**ప్రజాపక్షం/వైరా:** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వైరా మండలం కొండికొడమ గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమంపై గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ షేక్ బీజాన్‌బి మాట్లాడుతూ ఏప్రిల్ 8 నుండి 22 వరకు పోషణ పక్షంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా గురువారం స్థానిక గ్రామ అంగన్‌వాడీ టీచర్ చావా సునీత ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. వారు తీసుకోవాల్సిన ఆహారంపై సూచనలు ఇచ్చారు. గర్భం దాల్చిన మహిళలకు డెలివరీ వరకు ఆరోగ్యం పట్ల సిబ్బంది శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. తల్లి పౌష్టికాహారం తీసుకుంటూనే శిశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ఆహారాన్ని ఎక్కువ పరిమాణంలో తీసుకోవాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులకు శుభ్రత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

# ముత్యాల తలంబ్రాలు అందజేత

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆర్.టి.సి కార్గో ద్వారా భద్రాచలం శ్రీ సీతారాముల కళ్యాణ ముత్యాల తలంబ్రాలు బుకింగ్ చేసుకున్న వారికి సత్తుపల్లి డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మి కార్యాలయంలో ముత్యాల తలంబ్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్గో ద్వారా రూ.151 రూపాయలకు ఇంటి వద్దకే సీతారాముల కళ్యాణం ముత్యాల తలంబ్రాలు అందజేయబడునని ప్రచార నిర్వహించి బుకింగ్ చేయడం జరిగిందని, బుకింగ్ చేసుకున్న వారికి ఇంటి వద్దకు తలంబ్రాలు పంపించబడతాయన్నారు. అత్యధిక తలంబ్రాలు బుకింగ్ అవ్వడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు, పేరునా ధన్యవాదాలు తెలిపారు. ముత్యాల తలంబ్రాలు పంపిణీ కార్యక్రమంలో



కార్గో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్ కే మునీర్ పాష, వివిఓ కిన్నెర ఆనందరావు, ఎడిసిలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దగోపవరంలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని పెద్ద గోపవరం గ్రామ పరిధిలో సుమారు ఏడు లక్షల రూపాయల వ్యయంతో విద్యుత్ పనులను నిర్వహించినట్లు ఏఈ అనూష తెలిపారు. గ్రామంలో కొత్తగా 35 నూతన కరెంటు స్తంభాలను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సూచనలతో ఏడు లక్షల రూపాయలతో గ్రామంలో సుమారు 35 నూతన కరెంటు స్తంభాలు, కొత్త లైన్లు ఏర్పాటు చేయడం జరిగిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఏఈ అనూష మాట్లాడుతూ మండలంలో మారుమూల గ్రామాలతో సహా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో నూతన కరెంటు స్తంభాలు, కొత్త లైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు యన్నం వెంకటేశ్వరరెడ్డి, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# బీమా నగదు అందజేత

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని అయ్యవారిగూడెం సహకార సంఘ సభ్యులైన నర్సింహాపురం గ్రామానికి చెందిన షేక్ జాన్‌సాహెబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జాన్ సాహెబ్ కి అయ్యవారిగూడెం సహకార సంఘంలో సభ్యత్వం ఉండడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 50వేల బీమా నగదును ఆయన భార్య హిమాంబికి సొసైటీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, డిసిసిబి బ్యాంక్ మేనేజర్ దివ్య లు గురువారం ఎర్రుపాలెంలోని డిసిసిబి బ్యాంక్ నందు అందించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ సంఘ సభ్యులైన షేక్ జాన్‌సాహెబ్ మృతి బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులకు సహకార సంఘం బ్యాంకు సిబ్బంది తరుపున సానుభూతి వ్యక్తం చేశారు. రైతుల పక్షపాతిగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని సహకార సంఘం సేవలు ప్రతి ఒక్కరూ ఉపయోగించు



కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, క్యాషియర్ మౌనిక, జాని, సిఈవో మోహన్‌రావు, సొసైటీ సిబ్బంది మురళి, రమణరెడ్డి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఖమ్మంలో మెగా ఆర్గానిక్ మేళా



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో ఈనెల 12 నుంచి రెండు రోజుల పాటు మెగా ఆర్గానిక్ మేళా (మూలం సంత) నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లమల వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఖమ్మం నగరంలో టిడిపి ఆఫీస్ కార్యాలయం పక్కన గల ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ ఆవరణలో గ్రామ భారతి, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 12న శనివారం, 13న ఆదివారం ఆర్గానిక్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేళాలో ప్రత్యేకంగా చిన్నారి ఆచరణ నృత్య ప్రదర్శన, మన భద్రత మన బాధ్యత, ఇన్సూరెన్స్‌పై అవగాహన, బియ్యంలో రకాలు, ఆరోగ్యంలో వాటి ప్రాముఖ్యత, ఆహారంలో ఆరోగ్యం వంటి అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. సెంద్రీయ పద్దతిలో సాగు చేసి పండించిన కూరగాయలు, పండ్లు, చిరు ధాన్యాలు, దంపుడు బియ్యం, అరకు కాఫీ,దవాచాయ్, దేశవాళి ఆవునెయ్యి, గానుగ నూనెలు, వన మూలికల పొడులు, పసుపు, బెల్లం, తేనె, చేనేత వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు స్టాల్స్‌లో విక్రయానికి అందుబాటులో ఉంటాయని నల్లమల వెంకటేశ్వరరావు తెలిపారు.

# గౌతమ్ లింగాకు అంతర్జాతీయ ఉగాది పురస్కారం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని సూర్యనగర్‌కు చెందిన లింగ రమేష్(టీచర్) కుమారుడు గౌతమ్ లింగాకు అంతర్జాతీయ ఉగాది పురస్కారం వరించింది. సౌత ఆఫ్రికాలో ఉండే ప్రవాస భారతీయుడైన గౌతం ఉగాదిని పురస్కరించుకొని, అక్కడి వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సాహిత్య సేవా సంస్థ నిర్వహించిన కవి పోటీలలో మంచి కవిత్వాన్ని రాసినందుకు గాను లభించింది. ఈ శనివారం సాయంత్రం శ్రీ త్యాగారాయ,గాన సభ హైదరాబాద్‌లో ప్రధానోత్సవం చేయనున్నట్లు వంశీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ వంశీ రామరాజు తెలిపారు. ఈ అవార్డ్ రావడం పట్ల పలువురు ఖమ్మం కవులు, కుటుంబ సభ్యులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రతిభ చాటిన ప్రియదర్శిని విద్యార్థినులు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలో గల ప్రియదర్శిని మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినిలు ప్రాంగాణ నియామకాలలో గురువారం సత్తాచాటారు. సావి నెక్ట్స్‌లో 31మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఎంపిక కావడం పట్ల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మన్మోహన్‌తివారి, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# రిటర్నింగ్ వాల్ పనులు అడ్డగింత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లి వద్ద మున్నేటిపై నిర్మాణం చేపట్టనున్న రిటైనింగ్ వాల్ వద్ద గురువారం ఉద్రిక్తవాతావరణం చోటు చేసుకుంది. కొందరు రైతులు తమ భూముల్లోనుంచి రిటైనింగ్ వాల్‌ను ఏర్పాటు చేయవద్దని టెంట్ వేసుకొని ఆందోళనకు దిగారు. అలాగే నడుస్తున్న పనులను అడ్డుకున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడి చేరుకుని, రైతులతో మాట్లాడి ఎటువంటి ఘర్షణలకు చోటు చేసుకోకుండా పనులను నిలుపుదల చేపించారు.వీరికి సిపిఎం పార్టీ తరుపున ఊరడి సుదర్శన్ రెడ్డి, పలు పార్టీలు సంఘీబావం తెలిపాయి.

# ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఖమ్మం కార్పోరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు.రోడ్లపై ఉన్న పండ్ల దుకాణాలను అధికారులు తొలగించారు. గురువారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని కాల్వొడ్డు ప్రాంతంలో రోడ్లపై ఉన్న పండ్ల విక్రయ దుకాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు, డిఆర్ఎఫ్ సిబ్బంది కలిసి తొలగించారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

